# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 327 | పేజీలు: 5 | వెల: రూ.4/- | సోమవారం 30 జూన్ 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## ఉత్తరాదిని ముంచెత్తిన వానలు

### 24 గంటల పాటు చార్‌ధామ్ యాత్ర నిలిపివేత

న్యూఢిల్లీ, జూన్ 29 (నమస్తే ఉదయం) వాయవ్య, మధ్య, ఈశాన్య రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఉత్తరాఖండ్‌లోని ఉత్తర్‌కాశీ జిల్లాలో కుంభవృష్టి కారణంగా యమునోత్రి జాతీయ రహదారిలోని సిలాయ్ బైండ్‌లో ఆదివారం కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో నిర్మాణంలో ఉన్న ఓ హెూటల్ కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు మృతిచెందారు. ఏడుగురి ఆచూకీ గల్లంతైంది. ఘటనాస్థలానికి 18 కిలోమీటర్లల దూరంలోని తిలాడీ షాహిద్ స్మారక్ వద్ద ఆ ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. ప్రమాద స్థలంలో మొత్తం 29 మంది ఉన్నారని, వీరిలో 20 మందిని రక్షించామని అధికారులు తెలిపారు.

### ఎంపీ రఘునందన్‌కు

## మరోసారి బెదిరింపులు

- బీజేపీ ఎంపీ రఘునందన్‌రావుకు మరోసారి బెదిరింపు కాల్స్
- 'ఆపరేషన్ కగార్' ఆపాలంటూ ఆగంతకుల డిమాండ్
- ఏపీ మావోయిస్టు కమిటీ పేరుతో ఇంటర్నెట్ ద్వారా ఫోన్లు
- హైదరాబాద్‌లోనే ఐదు బృందాలున్నాయని హెచ్చరిక
- ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఘటన.. పోలీసులకు ఫిర్యాదు
- కొద్ది రోజుల క్రితమే ఓసారి హెచ్చరికలు.. అదనపు భద్రత ఏర్పాటు

2



### మరోసారి నోరు పారేసుకున్న

## పాక్ ఆర్మీ చీఫ్ మునీర్

- భారత్‌పై నిరాధార వ్యాఖ్యలు
- పాకిస్థాన్ ఆరోపణలను తీవ్రంగా ఖండించిన భారత్



హైదరాబాద్, జూన్ 29 (నమస్తే ఉదయం)

మరోవైపు భారత్ అకారణంగా రెండు సార్లు పాకిస్థాన్‌పై దాడికి పాల్పడిందని ఆ దేశ ఆర్మీ చీఫ్ అసిం మునీర్ నోరుపారేసుకున్నారు. న్యూఢిల్లీకి వ్యూహాత్మక ముందు చూపు కొరవడిందన్నారు. ప్రాంతీయ ఉద్రిక్తతలను రెచ్చగొడుతోందని ఆరోపిం చారు. మళ్లీ తమపై దాడికి పాల్పడితే నిర్ణయాత్మకంగా ప్రతిస్పందిస్తామని మునీర్ హెచ్చరించారు. కరాచీలోని నేవల్ ..మిగతా 2లో

### నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని

# ప్రారంభించిన అమిత్ షా

- 40 ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతుల కలను ప్రధాని మోదీ నెరవేర్చారని వెల్లడి
- పసుపు పంటకు నిజామాబాద్ రాజధాని లాంటిదని వ్యాఖ్య
- 2030 నాటికి బిలియన్ డాలర్ల పసుపు ఎగుమతులే ప్రభుత్వ లక్ష్యం
- రైతుల కోసం ఆధునిక సాగు పద్ధతులపై శిక్షణ, పంటకు జియో ట్యాగింగ్
- బోర్డు చైర్మన్‌గా తెలంగాణ వ్యక్తినే నియమించామని స్పష్టం



హైదరాబాద్, జూన్ 29 (నమస్తే ఉదయం)

తెలంగాణ పసుపు రైతులు నాలుగు దశాబ్దాలుగా కంటున్న కలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం నిజం చేసిందని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా అన్నారు. ఆదివారం నాడు నిజామాబాద్ పర్యటనలో భాగంగా ఆయన వినాయక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన జాతీయ పసుపు బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రైతుల అభ్యున్నతికి, పసుపు రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు.

"పసుపు పంటకు నిజామాబాద్ ఒక రాజధాని లాంటిది. అలాంటి చోట నా చేతుల మీదుగా పసుపు బోర్డును ప్రారంభించడం నా అదృష్టంగా భావిస్తున్నాను" అని అమిత్ షా తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తెలంగాణకు పసుపు బోర్డును సాధించడం కోసం బీజేపీ ఎంపీలు ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. వారి పోరాట ఫలితంగానే బోర్డును ఏర్పాటు చేయడమే కాకుండా, దానికి చైర్మన్‌గా తెలంగాణకు చెందిన వ్యక్తినే నియమించామని ఆయన తెలిపారు. నిజామాబాద్ పసుపుకు ప్రపంచ మార్కెట్లో గొప్ప పేరుందని, దాని ప్రాధాన్యతను మరింత పెంచాల్సిన అవసరం ఉందని అమిత్ షా ..మిగతా 2లో



### వారిని మనం ఎప్పటికీ

## స్మరించుకోవాలి

- మన్‌కీ బాత్‌లో ప్రధాని మోదీ
- దేశంలో ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తవడాన్ని మన్‌కీ బాత్‌లో ప్రస్తావించిన ప్రధాని

న్యూఢిల్లీ, జూన్ 29 (నమస్తే ఉదయం)

దేశంలో ఎమర్జెన్సీ విధించిన వారు రాజ్యాంగాన్ని హత్య చేసి, న్యాయ విభాగాన్ని బానిసగా మార్చుకోవాలనుకున్నారని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. నాడు జార్జిఫెర్నాండెజ్‌ను సంకెళ్లతో బంధించారని గుర్తు చేశారు. కానీ, భారత ప్రజలు శక్తిమంతమైన వారు కావడంతో ఎమర్జెన్సీ తొలగిపోయిందని, దానిని విధించినవారు ఓడిపోయారని గుర్తు చేశారు. దేశంలో ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తవడాన్ని మన్‌కీ బాత్‌లో ప్రస్తావించిన ప్రధాని, ఎమర్జెన్సీపై పోరాడిన మొరార్జీ దేశాయ్, వాజ్‌పేయి, బాబూ జగ్జీవన్ రామ్ వంటి నేతల ప్రసంగాలను మోదీ ప్రస్తావించారు. ఎమర్జెన్సీపై పోరాడిన వారిని కచ్చితంగా స్మరించుకోవాలనీ అది రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి మనల్ని ప్రేరేపిస్తుందన్నారు. భారత జనాభాలో 64 శాతం కన్నా ఎక్కువ మంది దాదాపు 95 కోట్లమంది ఏదో ఒక సామాజిక రక్షణ పథకంతో లబ్ధి పొందుతున్నట్లు ..మిగతా 2లో



### పూరీ జగన్నాథ రథయాత్రలో

## తొక్కిసలాట

- ముగ్గురు మృతి, 50 మందికి గాయాలు
- పూరీలో వైభవంగా సాగుతోన్న జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు
- గుండిచా ఆలయానికి రథాలు చేరుకున్న వేళ తోపులాట
- భక్తులను నియంత్రించడంలో విఫలమైన పోలీసులు
- పూరీ ఆలయంలో తొక్కిసలాట

పూరీ, జూన్ 29 (నమస్తే ఉదయం)

ఒడిశాలోని పూరీలో జరుగుతున్న జగన్నాథ రథయాత్రలో విషాదం చోటుచేసుకుంది. రథయాత్రలో తొక్కిసలాట చోటుచేసుకుని ముగ్గురు భక్తులు మృతి చెందగా, మరో 10 మందికి తీవ్ర గాయాలుయ్యాయి. మృతుల్లో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. మృతులను ఒడిశాలోని ఖుర్దా జిల్లాకు చెందిన ప్రభాతి దాస్, బసంతీ సాహూ, ప్రేమకాంత్ ..మిగతా 2లో

### కొండా మురళికి

## కాంగ్రెస్ షాక్

### వారంరోజుల డెడ్ లైన్.. ఉత్కంఠ!



హైదరాబాద్, జూన్ 29 (నమస్తే ఉదయం)

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొండా మురళి దంపతులు వర్సెస్ కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు అన్నట్టు ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో వీరి మధ్య చోటు చేసుకున్న పరస్పర ఫిర్యాదుల పైన విచారణ చేపట్టిన టిపిసిసి క్రమశిక్షణ కమిటీ వారం రోజుల్లో లిఖితపూర్వకంగా సమాధానం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిని ..మిగతా 2లో

### వాళ్లిద్దరికీ తెలియకుండా

## ఫోన్ ట్యాపింగ్ అసాధ్యం

- మహేశ్ కుమార్ గౌడ్
- కేసీఆర్, కేటీఆర్‌ల ప్రమేయం లేకుండా ఫోన్ ట్యాపింగ్ జరగదన్న టీపీసీసీ చీఫ్
- మహా న్యూస్ పై బీఆర్ఎస్ కార్యకర్తల దాడిని తీవ్రంగా ఖండన
- సినీ ప్రముఖులు, జడ్జిల ఫోన్లను ఎందుకు ట్యాప్ చేయాల్సి వచ్చింది? అంటూ ప్రశ్న
- మహిళల ఫోన్లు ట్యాప్ చేసి వారి కుటుంబాల్లో చిచ్చుపెట్టారని ఆగ్రహం
- అభ్యంతరాలుంటే దాడులు కాదు, చట్టపరంగా ముందుకెళ్లాలని హితవు



2

## మరో మూడు నెలల్లో కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్?

- కర్ణాటక రాజకీయాల్లో మళ్లీ రాజుకున్న నాయకత్వ మార్పు చర్చ
- రెండు, మూడు నెలల్లో డీకే శివకుమార్ సీఎం కావచ్చన్న ఇక్బాల్ హుస్సేన్
- కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ చేసిన వ్యాఖ్యలతో కలకలం
- పార్టీ గెలుపు కోసం డీకే ఎంతో శ్రమించారని ప్రస్తావించిన ఇక్బాల్
- ఇది విప్లవం కాదు, కేవలం మార్పు మాత్రమేనని వెల్లడి
- నాయకత్వ మార్పుపై కాంగ్రెస్ అధిష్టానమే తుది నిర్ణయం తీసుకుంటుందని స్పష్టీకరణ



న్యూఢిల్లీ, జూన్ 29 (నమస్తే ఉదయం)

కర్ణాటక రాజకీయాల్లో ముఖ్యమంత్రి మార్పుపై సాగుతున్న ఊహాగానాలకు కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్.ఏ. ఇక్బాల్ హుస్సేన్ చేసిన వ్యాఖ్యలు మరింత ఆజ్యం పోశాయి. మరో రెండు లేదా మూడు నెలల్లో ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు ముఖ్యమంత్రి పదవి దక్కవచ్చని ఆయన ఆదివారం వ్యాఖ్యానించడం ..మిగతా 2లో

# నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించిన అమిత్ షా




మొదటి పేజీ తరువాయి...

అభిప్రాయపడ్డారు. పసుపు కేవలం ఒక పంట కాదని, యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ క్యాన్సర్ గుణాలున్న ఒక దివ్య ఔషధమని ఆయన కొనియాడారు. "2030 సంవత్సరం నాటికి ఒక బిలియన్ డాలర్ల (సుమారు రూ. 8,300 కోట్లు) విలువైన పసుపు ఉత్పత్తులను భారతదేశం నుంచి ఎగుమతి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం" అని ఆయన స్పష్టం చేశారు.

ఈ బోర్డు ద్వారా రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై శిక్షణ అందిస్తామని, తద్వారా దిగుబడి, నాణ్యత పెంచేందుకు తోడ్పడతామని అమిత్ షా వివరించారు. నిజామాబాద్ పసుపునకు ప్రత్యేక గుర్తింపు కోసం ఇప్పటికే జియో ట్యాగింగ్ ప్రక్రియను కూడా ప్రారంభించామని వెల్లడించారు. భారత్ కో-ఆపరేటివ్ సొసైటీల ద్వారా రైతులు ఆర్థికంగా మరింత ప్రయోజనం పొందేలా కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, ఎంపీలు ధర్మపురి అర్వింద్, డాక్టర్ కె. లక్ష్మణ్, జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ కేతిరెడ్డి గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# వారిని మనం ఎప్పటికీ స్మరించుకోవాలి

మొదటి పేజీ తరువాయి...

అంతర్జాతీయ కార్మికసంస్థ తెలిపిందని ప్రధాని నరేంద్రమోదీ వివరించారు. 2015లో సామాజిక రక్షణ ఫలాలు కేవలం 25 కోట్ల మందికి అందేవని గుర్తుచేశారు. శాశ్వత అంధత్వానికి దారితీసే ట్రాకోమా వ్యాధి నుంచి భారత్ పూర్తిగా విముక్తి పొందినట్లు అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ-%ఔనూ% నిర్ధరించిందని 123వ మన్‌కీబాత్ ఎపిసోడ్‌లో మోదీ తెలిపారు. ఇటీవలి అంతర్జాతీయ యోగా దేను యావత్ ప్రపంచం జరుపుకుందనీ, అందరి జీవితాల్లో యోగా భాగమవుతోందని మోదీ హర్షం వ్యక్తం చేశారు. జూన్ 21న జరిగిన యోగా డే కార్యక్రమాల్లో దేశ, ప్రపంచ వ్యాప్తంగా లక్షల మంది పాల్గొన్నారని గుర్తు చేశారు. దాదాపు 10 ఏళ్ల క్రితం మొదలైన ఈ కార్యక్రమం ఏటేటా మరింత విస్తరిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. చాలాకాలం తర్వాత అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమైందన్న మోదీ, యాత్రికులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ భద్రాచలం ప్రాంతంలో మహిళలు మిల్లెట్లతో బిస్కెట్లు తయారు చేస్తున్నారనీ అవి లండన్‌కు కూడా ఎగుమతి అవుతున్నాయని చెప్పారు. వాళ్లే పర్యావరణహితమైన గిరి శానిటరీ ప్యాడ్స్‌ను ఉత్పత్తి చేస్తున్నారనీ, 3 నెలల్లోనే 40వేల ప్యాడ్స్‌ను తయారుచేశారని మోదీ ప్రశంసించారు.

ఫుట్‌బాల్ ఆటగాళ్లకు కేంద్రంగా బోడోల్యాండ్ మారిందని ప్రధాని మోదీ అభినందించారు. పరిమిత వనరులతోనే సాధన చేసి అద్భుతంగా రాణిస్తున్నారని, దేశంలోని చిన్నారులకు వీరు ఆదర్శంగా మారారని కొనియాడారు. ఫిట్‌నెస్, ఊబకాయం తగ్గించుకోవడానికి ఆహారంలో నూనె వినియోగాన్ని 10 శాతం తగ్గించుకోవాని సలహా ఇచ్చారు. మేఘాలయ ఎరీసిల్క్‌కు జీఐ ట్యాగ్ లభించిందని ప్రశంసించారు. పురుగులను చంపకుండా వస్త్రాన్ని తయారు చేయడం దీని ప్రత్యేకతని తెలిపారు.



# పూరీ జగన్నాథ రథయాత్రలో తొక్కిసలాట

మొదటి పేజీ తరువాయి...

మహాంతి (70 ఏళ్లు) గుర్తించారు. ఆదివారం తెల్లవారు జామున 4:30 గంటల సమయంలో, జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవిల రథాలు గుండిచా ఆలయం దగ్గరకు చేరుకున్నాయి. ఈ సమయంలో రథాలపై ఉన్న దేవతా మూర్తుల దర్శనం కోసం పెద్ద ఎత్తున భక్తులు ఎగబడ్డారు. రథాలు సమీపానికి వచ్చిన వేళ, తోపులాట జరగడంతో కొంతమంది పడిపోయి తొక్కిసలాటకు దారితీసింది. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మరణించారు.

స్థానిక మీడియా కథనాల ప్రకారం.. భక్తుల నియంత్రణకు పోలీసుల సరైన ఏర్పాట్లు చేయలేదనే ఆరోపణలు వస్తున్నారు.. గాయపడినవారిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. జగన్నాథ రథయాత్ర సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనపై పూరీ జిల్లా కలెక్టర్ సిద్ధార్థ శంకర్ స్వైన్ స్పందించారు. ముగ్గురు చనిపోయారని, మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం పంపినట్లు ఆయన తెలిపారు. మరణానికి గల కారణం వైద్య పరీక్ష అనంతరం వెల్లడవుతుందని ఆయన పేర్కొన్నారు.

"రథయాత్రకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాం. అయితే అనూహ్యంగా భక్తులు నియంత్రణ కోల్పోవడంతో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది' అని కలెక్టర్ వివరించారు. అటు, తొక్కిసలాట ఘటనపై మాజీ ముఖ్యమంత్రి, బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ స్పందించారు. "ఇది ఒక భయంకరమైన ఘటన. ఇప్పుడు మనం చేయగలిగింది ఒక్కటే బాధితుల కోసం ప్రార్థించటం. ఈ పవిత్ర ఉత్సవ ప్రతిష్ఠను మసకబార్చిన వారిని ఆ జగన్నాథుడు క్షమించాలి" అని పరోక్షంగా బీజేపీ ప్రభుత్వంపై ఆయన విమర్శలు గుప్పించారు. ఇక, శుక్రవారం రోజున కూడా అధిక వేడితో 600 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.

ఈ వ్యాఖ్యలపై ఒడిశా న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ స్పందిస్తూ.. నేరుగా పట్నాయక్ పేరు ప్రస్తావించకపోయినా, బీజేపీ నాయకులపై రాజకీయ ఆరోపణలు చేశారు. 'గతంలో బీజేపీడ ప్రభుత్వం కూడా పలు తప్పిదాలు చేసింది. జగన్నాథ స్వామిని అవమానించిందన్న ఆరోపణలు ఉన్నాయి. 1977 నుంచి రథాలు ఎప్పుడూ రెండో రోజు గుండిచా ఆలయానికి చేరేవి. కానీ ఈసారే ఆలస్యం జరగలేదు' అని అని కౌంటర్ ఇచ్చారు. పూరీ క్షేత్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది సూర్యాస్తమయం తర్వాత జగన్నాథుడి రథం కదిలింది. దీనిపై భక్తులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

ఆధ్యాత్మికంగానూ.. చారిత్రకంగానూ ఎంతో విశిష్ట కలిగింది పూరీ జగన్నాథ ఆలయం. పూరీలో ఏటా జరిగే రథయాత్రకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. జగన్నాథ స్వామి, బలభద్రుడు, సుభద్ర దేవిలను రథాలలో ఊరేగిస్తూ పెంచిన తల్లి గుండిచా ఆలయానికి తీసుకెళ్లే ఈ ఉత్సవం ఆధ్యాత్మికంగా అత్యంత ప్రాధాన్యమైనది. ఈ ఏడాది రథయాత్రకు 13 లక్షల మంది భక్తులు హాజరైనట్టు అంచనా.

# కొండా మురళికి కాంగ్రెస్ షాక్

మొదటి పేజీ తరువాయి...

ఆదేశించింది. నిన్న గాంధీభవన్లో మల్లురవి అధ్యక్షతన సమావేశమైన టిపిసిసి క్రమశిక్షణ కమిటీ జిల్లాలోని సొంత పార్టీ ఎమ్మెల్యేలు ఎంపీలు ఇతర ముఖ్య నాయకుల పైన కొండ మురళి చేసిన వ్యాఖ్యల పైన వివరణ కోరగా, మురళి గాంధీభవన్ కు తన అనుచర గణంతో చేరుకొని ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధుల పైన ఆరు పేజీల ఫిర్యాదు లేఖను కమిటీ చైర్మన్ మల్లు రవికి అందజేశారు. మొత్తం 150 వాహనాలతో తన బలాన్ని, బలగాన్ని ప్రదర్శిస్తూ కొండ మురళి గాంధీభవన్ వద్ద హంగామా చేశారు.

## క్రమశిక్షణా కమిటీకి కొండా షాకింగ్ ట్విస్ట్

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎమ్మెల్యేలతో తనకు ఉన్న విభేదాలు, సఖ్యత పైన అసలు కారణాలను లేఖలో సవివరంగా వివరించారు. అయితే ఇదే సమయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పైన కూడా ఆయన తన లేఖలో ప్రస్తావించారు. కొండ సురేఖ పైన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. కొండ మురళి తన లేఖ ద్వారా తాను చేసిన వ్యాఖ్యలను సమర్థించుకునే ప్రయత్నం చేశారు. వరంగల్ జిల్లాలో తనకు ఉన్న విభేదాలకు సంబంధించి చెప్పదలుచుకున్న అంశాలను లేఖ రూపంలో అందజేశారు.

## వారం రోజుల్లో రాతపూర్వక సమాధానం కావాలన్న క్రమశిక్షణా కమిటీ

అయితే %జూ౩ఎ% క్రమశిక్షణ కమిటీ మాత్రం తాము అడిగిన విషయాలపై వారం రోజుల్లో రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. క్రమశిక్షణ కమిటీ అడిగిన ప్రశ్నల పైన మాత్రమే వివరణ ఇవ్వాలని, కొత్త విషయాల పైన వివరణ తమకు అవసరం లేదని స్పష్టంగా చెప్పారు. తాము అడిగిన విషయాలపై వారం రోజుల్లో రాతపూర్వకంగా వివరణ పంపితే తదుపరి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఎటువంటి ఒత్తిడిలకు లొంగే ప్రసక్తే లేదని పేర్కొన్నారు.

# వాళ్లిద్దరికీ తెలియకుండా ఫోన్ ట్యాపింగ్ అసాధ్యం

## మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్, జూన్ 29 (నమస్తే ఉదయం)

తెలంగాణను కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్న వేళ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లకు తెలియకుండా ఫోన్ ట్యాపింగ్ జరగడం అసాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై స్పందిస్తూ, ఒక మీడియా ఛానల్‌పై బీఆర్ఎస్ శ్రేణులు చేసిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. వివిధ వర్గాల ఫోన్లను ట్యాప్ చేయడంపై మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "రాజకీయ నేతలే లక్ష్యమైతే, వారి కుటుంబ సభ్యులైన మహిళల ఫోన్లను ఎందుకు ట్యాప్ చేశారు?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. కేవలం రాజకీయ ప్రత్యర్థులే కాకుండా, సినీ తారలు, న్యాయమూర్తులు, మహిళా అధికారుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారని ఆయన ఆరోపించారు. ఈ చర్యల వల్ల ఎంతో మంది కుటుంబాల్లో లేనిపోని చిచ్చు పెట్టారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సినీ ప్రముఖుల వ్యక్తిగత సంభాషణలను దొంగచాటుగా వినాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీశారు. ఏదైనా విషయంపై అభ్యంతరాలు ఉంటే, ప్రజాస్వామ్యంలో చట్టపరంగా పోరాడాలని, అంతేగానీ మీడియా సంస్థలపై భౌతిక దాడులకు పాల్పడటం సరికాదని మహేశ్ కుమార్ గౌడ్ హితవు పలికారు. బీఆర్ఎస్ నాయకత్వం ఇటువంటి దాడులను ప్రోత్సహించవద్దని, చట్టపరమైన మార్గాలను అనుసరించాలని సూచించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిజానిజాలు విచారణలో తేలతాయని, బాధ్యులెవరైనా చట్టం ముందు నిలబడాల్సిందేనని ఆయన అన్నారు.

# మరో మూడు నెలల్లో కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్?

మొదటి పేజీ తరువాయి...

రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పార్టీ అధిష్టానం సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

డీకే శివకుమార్‌కు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉందా అని విలేకరులు ప్రశ్నించగా, ఇక్బాల్ హుస్సేన్ స్పందిస్తూ, "ఈ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ బలం ఏంటో అందరికీ తెలుసు. ఈ విజయం కోసం ఎవరు కష్టపడ్డారో, చెమటోడ్చి పనిచేశారో కూడా అందరికీ తెలిసిందే. ఆయన (డీకే శివకుమార్) వ్యూహాలు, కార్యక్రమాలు ఇప్పుడు చరిత్రలో నిలిచిపోయాయి," అని అన్నారు. అధిష్టానానికి పరిస్థితిపై పూర్తి అవగాహన ఉందని, సరైన సమయంలో డీకేకు అవకాశం కల్పిస్తుందనే నమ్మకం తమకుందని ఆయన పేర్కొన్నారు.

ఈ ఏడాదే డీకే శివకుమార్ సీఎం అవుతారా అని అడగ్గా, "అవును, నేను అదే చెబుతున్నాను. రెండు, మూడు నెలల్లోనే నిర్ణయం వెలువడుతుంది. సెప్టెంబర్ తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో సంచలన మార్పులు ఉంటాయని కొందరు నేతలు చెబుతున్నది దీని గురించే. నేను దాచిపెట్టి మాట్లాడటం లేదు, నేరుగానే చెబుతున్నాను," అని ఇక్బాల్ స్పష్టం చేశారు.

గతంలో సహకార శాఖ మంత్రి కేఎన్ రాజన్న చేసిన "విప్లవాత్మక" మార్పుల వ్యాఖ్యలపై మాట్లాడుతూ, "విప్లవం అంటే అర్థం ఏమిటి? రాజకీయాల్లో మార్పులు రావడం సర్వసాధారణం. అర్హులైన వ్యక్తికి అవకాశం ఇవ్వడాన్ని విప్లవం అని అనలేం. సమయం వచ్చినప్పుడు ఎవరికి బాధ్యతలు అప్పగించాలో అధిష్టానం నిర్ణయిస్తుంది," అని వివరించారు. మరో పార్టీ వచ్చి ప్రభుత్వాన్ని పడగొడితే దాన్ని విప్లవం అనవచ్చని, కానీ ఇప్పుడు అలాంటిదేమీ జరగడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి మెజారిటీతో బలంగా ఉందని ఆయన తెలిపారు.

ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కుమారుడు, ఎమ్మెల్సీ యతీంద్ర సిద్ధరామయ్య ఈ వార్తలను కేవలం ఊహాగానాలుగా కొట్టిపారేయడంపై ఇక్బాల్ స్పందిస్తూ, "2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రభుత్వ ఏర్పాటుపై సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలతో కూడిన అధిష్టానమే నిర్ణయం తీసుకుంది. ఆ విషయం అందరికీ తెలుసు. తదుపరి నిర్ణయం కూడా వారే తీసుకుంటారు. దాని కోసం వేచి చూడాలి," అని అన్నారు. కాంగ్రెస్‌లో క్రమశిక్షణ, నిబద్ధత ఉన్నాయని, పార్టీలో ఒకే పవర్ సెంటర్ ఉందని, అది అధిష్టానం మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. పార్టీ కోసం ఎందరో త్యాగాలు చేశారని, ప్రస్తుత పరిస్థితుల్లో మార్పు రావాలని అందరూ ఆశిస్తున్నారని, అయితే అది విప్లవం కాదని ఆయన పేర్కొన్నారు.

# ఎంపీ రఘునందన్‌కు మరోసారి బెదిరింపులు

హైదరాబాద్, జూన్ 29 (నమస్తే ఉదయం)

తెలంగాణ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావుకు బెదిరింపుల పర్వం కొనసాగుతోంది. ఇటీవల కాలికి శస్త్రచికిత్స చేయించుకుని హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనకు, మరోసారి ప్రాణహాని తలపెడతామంటూ మరోసారి హెచ్చరికలు వచ్చాయి. ఆదివారం రెండు వేర్వేరు ఫోన్ నంబర్ల నుంచి కాల్స్ చేసిన ఆగంతకులు, ఛత్తీస్ గఢ్ లో 'ఆపరేషన్ కగార్'ను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తాము ఏపీ మావోయిస్టు కమిటీకి చెందిన వారిమని, తమ ఆదేశాల మేరకు ఐదు ప్రత్యేక బృందాలు ఇప్పటికే హైదరాబాద్‌లో రంగంలోకి దిగాయని వారు చెప్పినట్టు సమాచారం. "మా టీమ్‌లు నగరంలోనే ఉన్నాయి. మరికాసేపట్లోనే నిన్ను చంపేస్తాం. దమ్ముంటే నిన్ను నువ్వు కాపాడుకో" అంటూ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. పోలీసులు తమ ఫోన్లను ట్రేస్ చేసేందుకు ప్రయత్నిస్తున్నా తమ ఆచూకీ దొరకదని, ఎందుకంటే తాము ఇంటర్నెట్ కాల్స్ ఉపయోగిస్తున్నామని ఆ వ్యక్తులు స్పష్టం చేశారు. ఏ పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని వారు తేల్చిచెప్పినట్లు తెలిసింది. రఘునందన్‌రావుకు ఇలాంటి బెదిరింపులు రావడం ఇది రెండోసారి. గత జూన్ 23న తొలిసారిగా ఆయనకు బెదిరింపు కాల్ వచ్చింది. ఆ సమయంలోనే ఆయన రాష్ట్ర డీజీపీతో పాటు మెదక్, సంగారెడ్డి ఎస్పీలకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం ఆయనకు భద్రతను పెంచి, ఎస్కార్ట్ వాహనంతో పాటు అదనపు సిబ్బందిని కేటాయించింది. అయినప్పటికీ బెదిరింపులు ఆగకపోవడం ఆందోళన కలిగిస్తోంది. రెండు రోజుల క్రితమే కాలికి శస్త్రచికిత్స చేయించుకున్న రఘునందన్‌రావు, ప్రస్తుతం ఆసుపత్రిలోనే కోలుకుంటున్నారు. ఈ క్రమంలోనే తాజా బెదిరింపులు రావడంతో ఆయన ఆసుపత్రి నుంచే మరోమారు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ ప్రారంభించారు.

# మరోసారి నోరు పారేసుకున్న పాక్ ఆర్మీ చీఫ్ మునీర్


మొదటి పేజీ తరువాయి...

అకాడమీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మునీర్, ప్రాంతీయ స్థిరత్వాన్ని పాకిస్థాన్ కాపడుతోందన్నారు. భారత్ దుందుడుకు తనానికి పాల్పడితే తమ దేశం ప్రాంతీయశాంతిని దృష్టిలో పెట్టుకొని పరిపక్వంగా వ్యవహరించిందన్నారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా అణచివేసే స్థితిలో పాక్ ఉంటే భారత్ ఉద్రిక్తతలు సృష్టిస్తోందని వ్యాఖ్యానించారు.

అంతకుముందు మునీర్ ఇలాంటి నిరాధార వ్యాఖ్యలే చేశారు. ఆర్మీ ఆఫీసర్స్ కామన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న ఆయన, భారత్ ఉగ్రవాదాన్ని పోషిస్తోందని వింత వ్యాఖ్యలు చేశారు. న్యూఢిల్లీ నెట్‌వర్క్‌కు అఫ్గానిస్థాన్ వేదికగా మారిందనీ, అఫ్గాన్ వాసులతో కలిసి పాక్‌లో దాడులు చేస్తోందని ఆరోపించారు. భారత్ పోషిస్తున్న ఉగ్రవాదులకు అఫ్గానిస్థాన్ వేదిక ఇవ్వకూడదని కోరుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## పాకిస్థాన్ వ్యాఖ్యలపై భారత్ కౌంటర్

వజీరిస్థాన్‌లో జరిగిన ఆత్మాహుతి దాడి వెనక భారత్ హస్తం ఉందన్న పాకిస్థాన్ ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. అవన్నీ తప్పుడు, నిరాధార ఆరోపణలని స్పష్టం చేసింది. ఆత్మాహుతి దాడి నేపథ్యంలో భారత్‌పై నిందలు వేస్తూ పాక్ సైన్యం చేసిన అధికారిక ప్రకటన తమ దృష్టికి వచ్చిందని తెలిపింది. ఈ ప్రకటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని భారత విదేశాంగశాఖ ప్రకటన విడుదల చేసింది. 800 కిలోలు ఉన్న భారీ పేలుడు పదార్థాలున్న వాహనంతో వజీరిస్థాన్‌లో ఓ ఉగ్రవాది సైనిక కాన్వాయ్‌పైకి దూసుకెళ్లి



ఆత్మాహుతికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో 13 మంది పాక్ సైనికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పౌరులు, ప్రభుత్వాధికారులతో సహా 24 మందికి తీవ్రగాయాలయ్యాయి. పాకిస్థాన్ లోని తాలిబన్ హఫీజ్ గుల్ బహదూర్ గ్రూపునకు చెందిన ఉసూద్ -అల్ -హర్బ్ ఈ పేలుడుకు బాధ్యత వహిస్తున్నట్లు ప్రకటించింది. ఆ దాడి వెనుక భారత్ హస్తం ఉందని పాక్ నిరాధార ఆరోపణలు చేసింది.

### 1984-85లో రాజేంద్ర నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో

# 10వ తరగతి విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థులు


1984 85వ విద్యా సంవత్సరంలో రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు, గురువులు

రాజేంద్రనగర్, (నమస్తే ఉదయం):రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1984-85 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఉప్పర్ పల్లి ఇంపిరియా బ్యాంకెట్ హాల్ లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.ఎనబై మంది విద్యార్థులు,వారి కుటుంబ సభ్యులు,ముగ్గురు ఉపాధ్యాయులు ఈ ఆత్మీయ సమ్మేళనం లో పాల్గొన్నారు.చిన్ననాడు తాము చదువుకున్న రోజుల్లో మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు.తమ కు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించి ఆశీర్వాదాలు తీసుకున్నారు.తమకు పాఠాలు చెప్పి నేడు స్వర్గంలో ఉన్న గురువులను,తమతో చదువుకొని మరణించిన స్నేహితులను గుర్తు చేసుకుని రెండు నిమిషాలు మౌనం పాటించారు.తాము నేడు ఏ పని చేస్తున్నాం..ఎక్కడెక్కడ స్థిరపడ్డామో వివరించారు. అందరు కలసి భోజనాలు చేశారు.ఉపాధ్యాయులకు,విద్యార్థులకు నలబై సంవత్సరాల జ్ఞాపికలు అందజేశారు.చాలా సంతోషంగా ఉంది ఉపాధ్యాయులు: నలబై నుంచి యాభై సంవత్సరాల క్రితం రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుని తిరిగి అందరు కలసుకోవడం,ఈ సందర్భంగా తమను పిలిచి గౌరవించి సన్మానిం చడం సంతోషంగా ఉందని ఉపాద్యాయులు అనంతరెడ్డి,కమల,గాబ్రియేలమ్మ లు తెలిపారు.విద్యార్థులందరు తమను గుర్తు పెట్టుకుని ప్రేమతో ఆహ్వానించి గౌరవించి సన్మానించడం తమ హృదయాలను కలచివేసిందన్నారు.ఉపాధ్యాయులుగా విద్యార్థులే తమ సంపద అన్నారు. మీరందరు తమను గుర్తు పెట్టుకోవడం సంతోషంగా ఉందన్నారు.రాజేంద్రనగర్ అంటే తమకెంతో అభిమానమన్నారు.విద్యార్థులకు మిఠాయిలు పంచి పెట్టిన కమల టీచర్ చిన్న నాడు తమ వద్ద చదువుకున్న పూర్వ విద్యార్థులకు హిందీ ఉపాధ్యాయురాలు కమల మిఠాయిలు పంచి పెట్టారు.తమ పిల్లలకు మిఠాయిలు పంచి పెట్టడం ఎంతో ఆనందంగా ఉం దన్నారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వై.శ్రీధర్,ఎం.శ్రీనివాస్ యాదవ్,ఎండీ షర్ఫుద్దీన్,బి.వేణుగోపాల్,సామ సుమన్ రెడ్డి,కాశీ విశ్వనాథ్ గౌడ్,ఎం.రాంబాబు యాదవ్, వేముల చక్ర పాణి,ఎస్.నర్సిహ్మారెడ్డి, బి.ఆంజనేయులు, ఎ.భీమయ్య,మంజూర్ అహ్మద్. కె.విజయ్ కుమార్,రవీందర్ షిండే,ఎం.నాగభూషణం, విజయలక్ష్మి,కె.సరోజ, వనితారెడ్డి, టి. రమాదేవి, ఎన్.బాబురాజ్ , వై .సత్యనారాయణ,జి.చిమన్ లాల్,సయ్యద్ హిదాయతుల్లా షఫీ,జయశ్రీ, రాజేందర్ యాదవ్ ,తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మిగూడ లో సింధూర్ కాలనీ ముఖ ద్వారానికి ప్రారంభోత్సవం చేస్తున్న బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

## సిందూర్ కాలనీ ముఖద్వారం ప్రారంభం

బుద్వేల్, జూన్ 29 (నమస్తే ఉదయం): ఉగ్రమూకలపై భారత సైన్యం జరిపిన 'ఆపరేషన్ సిందూర్' పేరు తో మైలార్ దేవ్ పల్లి డివిజన్ లో ఓ కాలనీ పేరు సిందూర్ గా పెట్టారు. ఆదివారం కాలనీ మీ ముఖద్వారాన్ని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...దేశవ్యాప్తంగా ఆపరేషన్ సిందూర్ పేరు మారుమోగుతోందన్నారు. ఉగ్రమూకలపై భారత సైన్యం జరిపిన 'ఆపరేషన్ సిందూర్' వైమానిక దాడులు దేశంలోని సామాన్యప్రజల హృదయాలు సైతం ఉప్పొంగేలా చేశాయని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో అడికే జనార్దన్, సుబ్బారెడ్డి, మనీష్ తివారి, మధుసూదన్ రెడ్డి, ఉజ్వల్, అడికె శివ, సంతోష్, శ్రీధర్ రెడ్డి, ఓం ప్రకాష్,సంపత్ మనీష్, శంకర్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని నరేంద్ర మోడీ 11 ఏళ్ల పాలన దేశానికి ప్రపంచ ఖ్యాతి

**జిల్లా బిజెపి అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్**

రాజేంద్రనగర్, జూన్ 29 (నమస్తే ఉదయం) దేశ ప్రధాని నరేంద్ర మోడీ 11 ఏళ్ల పాలన ప్రపంచ ఖ్యాతిని తెచ్చిపెట్టిందని భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ అన్నారు. ఆదివారం అత్తాపూర్ డివిజన్ లో ఆయన మన్ కి బాత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు రచ్చబండ పేరు తో భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రధానమంత్రి గా 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన చేసిన అభివృద్ధి పనులను అలాగే స్కీమ్స్ ను కరపత్రం ద్వారా ప్రజలకు అందిస్తూ డోర్ టు డోర్ డివిజన్ అధ్యక్షులు సుల్గే వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా సెక్రెటరీ కొమురయ్య ,కే సుధాకర్ రాజశేఖర్, విజయ్, కిరణ్ చారి ,జి రాజు, పి వెంకట్ రెడ్డి, ఆర్ జగన్ , శశికాంత్ శర్మ, విమల్ శర్మ ,విజయ, స్వామి, ఉమా, గుర్ప్రీత్ సింగ్ నరేష్ ,లక్ష్మారెడ్డి, ప్రవీణ్, సతీష్, శ్రీను, రాము, విజయరావత్ తదితరులు పాల్గొన్నారు.

**లక్ష్మీగూడలో...**

దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం నిర్వహించిన మన్ కి కార్యక్రమం ను

మైలార్ దేవ్ పల్లి డివిజన్ - 2 అధ్యక్షులు సోరెడ్డి వినయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో లక్ష్మీగూడ లో అడికే రాజు నివాసం లో మాన్ కి బాత్ వీక్షించారు. ఈ కార్యక్రమం లో బిజెపి దళిత మోర్చా రాష్ట్ర నాయకులు జోగి రవి, అడిగే మహేందర్, ,బాల శ్రీనివాస్ యాదవ్ , జోగు విజయ్ , జున్ను పవన, శివ శంకర్ ,అరుణ్ కుమార్, ప్రేమ్ కుమార్ , అభిలాష్, డి వేణు తదితరులు పాల్గొన్నారు .



అత్తాపూర్ డివిజన్‌లో మన్ కి బాత్ కార్యక్రమం వీక్షిస్తున్న జిల్లా బిజెపి అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్

మన్ కి బాత్ ఎమర్జెన్సీ గురించి జ్ఞాపకం

1975-77 నాటి ఎమర్జెన్సీ దుశ్చరిత్రను గుర్తు చేశారు.

ప్రజాస్వామ్యాన్ని, న్యాయవ్యవస్థను అణిచివేయడం ఎంత ప్రమాదకరమో ప్రజలకు వివరించారు.

యోగా ప్రాముఖ్యత

అంతర్జాతీయ యోగా దినోత్సవం 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అభినందనలు తెలిపారు.

ఆరోగ్యంగా ఉండేందుకు రోజువారీగా యోగా చేయాలని పిలుపునిచ్చారు.

ట్రాకోమా రహిత భారత్

భారత్ అధికారికంగా ట్రాకోమా అనే కంటి వ్యాధి నుండి పూర్తిగా విముక్తి పొందిందని ప్రకటించారు.

ఇది దేశ ఆరోగ్య రంగానికి గొప్ప విజయంగా చెప్పారు.

ధార్మిక యాత్రల ప్రాధాన్యత

అమరనాథ్ యాత్ర జూలై 3 నుండి ప్రారంభమవుతుందని తెలిపారు.

యాత్రలు, పుణ్యక్షేత్ర సందర్శనలు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు.

ప్రేరణాత్మక వ్యక్తుల కథలు

చెనాబ్ బ్రిడ్జ్ నిర్మాణంలో పని చేసిన కార్మికులను ప్రశంసించారు.

తెలంగాణాలో 3 వేల ప్రత్యేక అవసరాలు కలిగిన వారు పాల్గొన్న ఘటనను ప్రస్తావించారు. మేఘాలయ సిల్కు కు ట్యాగ్ లభించిందన్నారు.

సామాజిక భద్రతలో విస్తరణ

2015లో 25 కోట్ల మంది మాత్రమే సామాజిక భద్రత కింద ఉండగా, 2025 నాటికి 95 కోట్లకు పైగా పెరిగిందని వెల్లడించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

## పరస్పర సహకాంరంతోనే ప్రగతి సాధ్యం

బుద్వేల్, జూన్ 29( నమస్తే ఉదయం): మైలార్దేవుపల్లి డివిజన్ మార్కండేయనగర్ లోని సత్యసాయి పరస్పర సహయక సహకార పొదుపు సంఘం లిమిటెడ్ పాలకమండలి సంకల్పిం చిన ఫంక్షన్హాల్ నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్ హామీ ఇచ్చారు. పాలక మండలి సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమై నిర్మాణ స్థలం నిర్మాణ ప్లాన్ ను త్వరలోనే సమీక్షిస్తానన్నారు. ఆదివారం శివరాంపల్లి ప్రజా భవన్ లో సత్యసాయి పొదుపు సంఘం అధ్యక్షుడు పగిడిమర్రి సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సంఘం రజతోత్సవ మహా సభలో ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. 25 సంవత్సరాల క్రితం స్థాపించిన సత్యసాయి పొదుపు 664 మంది సభ్యులకు సేవలందిస్తు రూ. 5కోట్ల టర్నోవర్ తో అభివృద్ధి పథంలో కొనసాగడు సంతోషకరం అన్నారు. సంఘ వ్యవస్థాపక కార్యదర్శి, సలహాదారులు గద్దె యాదగిరి. సలహాదారులు ఎర్వ సత్యనారాయణ, గద్దె క్రిష్ణ, పగిడిమర్రి వాసు, సంఘం ఉపాధ్యక్షులు మునగపాటి విషు, ప్రధాన కార్యదర్శి కోట శ్యామ్కుమార్, సహాయ కార్యదర్శి కర్నాటి శ్రీనివాస్, కోశాధికారి కోట పవన్ కుమార్, పాలక మ ండలి సభ్యులు కంది అశోక్. కె.శంకర్, విరమేశ్, ఎస్ నరేందర్, జి.నరేశ్, జి.దనుంజయ్. బి.విజయ్ కుమార్, బి. భానుచందర్ తదితరులు ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ ను ఘనంగా సన్మానిం చారు. చిన్న కాలనీ అయినా, పరస్పరం పొదుపులో ధీటు మార్కండేయనగర్ బస్తీ వాసులని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ, మైలారేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సంఘం సభ్యులను ఆయన అభినందించారు. సత్యసాయి సంఘానికి తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

# సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న డివిజన్ ప్రజలు

**పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు**

**ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతాం: డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్**

రాజేంద్రనగర్, జూన్ 29 (నమస్తే ఉదయం) ప్రజలు సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవటం లేదని మైలార్ దేవుపల్లి డివిజన్ బి.ఆర్.ఎస్ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్ ఆరోపించారు. ఆదివారం బి ఆర్ ఎస్ ప్రజా సమస్యల కోసం చేపట్టిన శుభోదయం కార్యక్రమంలో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీఇన్చార్జ్ కార్తీక్ రెడ్డి ఆదేశాల మేరకు మైలార్ దేవ్ పల్లి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులుఎస్ వెంకటేష్ మాజీ కౌన్సిలర్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులతో కలిసి సాయిబాబా నగర్ ఆదర్శనగర్ ( వడ్డెర బస్తి) నర్సాబాయికుంటను సందర్శించారు. నర్సబాయికుంట అభివృద్ధి కోసం 2016 సంవత్సరంలో స్థానిక ఎమ్మెల్యే ,కార్పొ రేటర్ నర్సాబాయికుంట సుందరీకరనలొ భాగంగా పార్క్ , వాకింగ్ ట్రాక్ నిర్మించి ప్రజలకు ఉపయోగపడే విధంగా చేయాలన్న ఉద్దేశంతో పనులకోసం అప్పటి ప్రభుత్వం ఒక కోటి పదిహేను లక్షలు నిధులు మంజూరు చేశారు,కానీ పనులు పూర్తి చేయడంలో ప్రజాప్రతినిధులు కానీ, అధికారులు కానీ కార్యరూపం దాల్చలేదని ఆయన ఆరోపించారు. కోటి 15 లక్షలు ఖర్చు చేసిన పార్కు పూర్తి కాలేదన్నారు. నర్సాభాయికుంట మురుగనీటితో నుండి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే చెందగా తయారైందని ఆయన గుర్తు చేశారు. మళ్లీ కోటి రూపాయలు సాంక్షన్ చేసి రెండు కోట్ల పైచిలుకు ఖర్చుచేసినా కాని నర్సబాయి కుంట సుందరీకరణ దేవుడెరుగు కానీ మురికి కుంటలా తయారై అక్కడి ప్రజలు మాత్రం దోమల కాటుకు రోగాలతో ఆస్పత్రి పాలు అవుతున్నారని మండిపడ్డారు. రెండు కోట్ల రూపాయల ప్రజాధనం ఏం చేశారు ఎమ్మెల్యే, కార్పొరేటర్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సాయిబాబా నగర్ నుండి శివరాంపల్లి రైల్వే స్టేషన్ వరకు ఉన్న రహదారి పక్కన ఫుట్ పాత్ ను ఆక్రమించుకొని కొందరు సొంత అవసరాలకు వాడుకుంటున్నారు, ఇంకొందరు రోడ్డుకు అడ్డంగా పెద్ద పెద్ద లారీలను అడ్డుపెట్టి రోడ్డు మీదనే కట్టెల వ్యాపారం చేస్తున్నారు ఎన్నిసార్లు స్థానిక నాయకులు అధికారులకు చెప్పిన దున్నపోతు మీద వాన పడ్డట్టు పెడచెవిన పెడుతున్నారె తప్ప కట్టెల వ్యాపారిపై చర్య తీసుకుందాం అన్న సోయి కూడా లేదు, కొందరు స్థానిక నాయకులు అక్కడి వ్యాపారులతో కక్కుర్తి పడి వారిపై చర్య తీసుకోకుండా అడ్డుపడుతున్నారని స్థానిక ప్రజలు వాపోయారు,స్థానిక కార్పొరేటర్ కి ఆదర్శనగర్ వడ్డెర బస్తి ప్రధాన రహదారిపై మూడు సంవత్సరాల క్రితం సివరెజ్ పైపుల గురించి రోడ్డు ను తొవ్వి ప్యాచ్ వర్క్ కూడ చేయకుండా వదిలేయడంతో పధాచారుల తో పాటు టూ వీలర్,ఫోర్ వీలర్ స్కూల్ వాహనాదారులకు నరకం ఎట్లుందో ఆ రహదారి వెంబడి వెళ్తే తెలుస్తుంది,ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే , కార్పొరేటర్లు శ్రద్ధ వహించి కట్టెల వ్యాపారిపై చర్య తీసుకుని ఆదర్శనగర్ (వడ్డెర బస్తి)వద్ద ప్యాచ్ వర్క్ చేయాలని కోరారు. ఈ పర్యటనలో టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






అత్తాపూర్ నుంచి ఉప్పర్ పల్లి వరకు సాగిన జగన్నాథ రథ యాత్ర.. పాల్గొన్న భక్తులు

## అత్తాపూర్ నుంచి ఉప్పర్‌పల్లి వరకు సాగిన జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న వేలాది మంది భక్తులు

బుద్వేల్, జూన్ 29(నమస్తే ఉదయం): ఇస్కాన్ అత్తాపూర్ ఆధ్వర్యంలో ఆదివారం అత్తాపూర్ నుంచి ఉప్పర్ పల్లి వరకు శ్రీ జగన్నాథ రథయాత్ర ను నిర్వహించారు. ఈ రథయాత్రలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. అత్తాపూర్ నుంచి ఉప్పర్ పల్లి వరకు సాగిన రథయాత్ర ఊరేగింపు తో రోడ్లన్ని భక్తులతో కిక్కిరిసి పోయాయి. హరే రామ హరే క్రిష్ణ .. క్రిష్ణ క్రిష్ణ హరే హరే అంటు రహదారులలో భక్తుల పాటలతో మారుమ్రోగాయి. ఈ సందర్భంగా ఉప్పర్ పల్లి సామ భూ పాల్ రెడ్డి గార్డెన్ లో భక్తులు సమావేశమైన భజనలు, కీర్తనలు పాడారు.

# రాజేంద్రనగర్ అంటే.. ఇక్కడి విద్యార్థులంటే తమకు ఎంతో ప్రేమ: ఉపాధ్యాయులు


మాట్లాడుతున్న కమల టీచర్


అనంత రెడ్డి సార్


గాబ్రియేలమ్మ టీచర్

బుద్వేల్, జూన్ 29(నమస్తే ఉదయం): రాజేంద్రనగర్ అన్నా... ఇక్కడ విద్యార్థులు అన్న తమకు ఎంతో ప్రేమ అని రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేసిన కమల టీచర్ , అనంతరెడ్డి సార్, గాబ్రియేలమ్మ టీచర్ లు అన్నారు.

1984 85వ విద్యా సంవత్సరంలో రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థుల ఆద్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు మాట్లాడుతూ, పదవ తరగతి పూర్తయి 40 సంవత్సరాలు కావస్తున్న తమను గుర్తుపెట్టుకుని పిలిచి సన్మానించడం చూస్తుంటే ఎంతో సంతోషం వేస్తుంది అన్నారు . తమకు మీరే పిల్లలు అని గుర్తు చేసుకున్నారు.

# తెలంగాణ రాష్ట్రంలో జపనీస్ సాంకేతికతతో "అడవి సృష్టించడం" కోసం ఎస్ఐపి అకాడమీ యోచిస్తోంది: ఉమా స్వామినాథన్

### ఎస్ ఐ పి అకాడమీ విదేశాలలో తన పాదముద్రను విస్తరించాలని యోచిస్తోంది: సిబి శేఖర్

హైదరాబాద్, జూన్ 29(నమస్తే ఉదయం) తెలంగాణ రాష్ట్రంలో జపనీస్ సాంకేతికత అయిన మియావాకి పద్ధతిని ఉపయోగించి "అడవి సృష్టించడం" కోసం ఎస్ ఐ పి అకాడమీ యోచిస్తోందని ఉమా స్వామినాథన్ అన్నారు. ఆదివారం శంషాబాద్ సమీపంలోని క్లాసిక్ కన్వెన్షన్-3లో జరిగిన 21వ తెలంగాణ ప్రాంతీయ ఎస్ ఐ పి ప్రాడిజీ పోటీ 2025లో రికార్డు స్థాయిలో 3,100 మంది పిల్లలు పాల్గొన్నారు. భారతదేశంలోని ప్రముఖ పిల్లల నైపుణ్య అభివృద్ధి సంస్థ ఎస్ ఐ పి అబాకస్ నిర్వహించిన ఈ కార్యక్రమం మానసిక చురుకుదనం, విద్యా నైపుణ్యానికి పోటీ నిర్వహించింది . ఎస్ ఐ పి ప్రాడిజీ అనేది వార్షిక అబాకస్ , మానసిక అంకగణిత పోటీ. ఉత్సాహంతో నిండిన , "మానవ కాలిక్యులేటర్లు" అని పిలువబడే పిల్లలు కేవలం 11 నిమిషాల్లో 200 కి పైగా అంకగణిత సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నించారు ఈ పోటీలో , వారి అబాకస్-ఆధారిత మానసిక గణిత నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ పోటీని రెండు రౌండ్లలో నిర్వహించారు, ప్రతి సెషన్‌లో 1,550 మంది విద్యార్థులు పోటీ పడ్డారు.పోటీని ప్రారంభిస్తూ, ఎస్ ఐ పి అకాడమీ డైరెక్టర్ సిబి శేఖర్, "అబాకస్ గణితానికి అతీతమైనది. ఇది అవసరమైన జీవిత నైపుణ్యాలను - ఏకాగ్రత, వినడం, జ్ఞాపకశక్తి మరియు పోటీ స్ఫూర్తిని - నిర్మిస్తుంది - ఇవన్నీ విద్యా నైపుణ్యం మరియు ఆత్మవిశ్వాసానికి పునాది వేస్తాయి" అని నొక్కి చెప్పారు."ఏదైనా పోటీలో రెండు ఫలితాలు ఉంటాయి: ఒకటి విజేత, మరొకటి అభ్యాసకుడు. గెలవడం లేదా ఓడిపోవడం కంటే పాల్గొనడం ముఖ్యం - ఇది స్థితిస్థాపకత ఎదగడానికి స్ఫూర్తిని పెంచుతుంది."ఈ పోటీలో ప్రాంతీయ విజేతలు నవంబర్ 2025 లో చెన్నైలో జరగనున్న అంతర్జాతీయ ప్రాడిజీ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తారు, ఇక్కడ 23 భారతీయ రాష్ట్రాలు మరియు 11 దేశాల నుండి 5,000 మందికి పైగా



పిల్లలు పోటీ పడతారని భావిస్తున్నారు. ఎస్ ఐ పి అబాకస్ శిక్షణలో అత్యంత అధునాతన దశ అయిన ప్రతిష్టాత్మక గ్రాండ్ మాస్టర్ స్థాయిని పూర్తి చేసిన 300 మంది విద్యార్థులకు స్నాతకోత్సవ వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి ముందు మీడియాతో మాట్లాడుతూ... శేఖర్ సంస్థ ప్రతిష్టాత్మక విస్తరణ ప్రణాళికలను పంచుకున్నారు. ప్రస్తుతం 23 భారతీయ రాష్ట్రాలు , 11 దేశాలలో ఉన్న ఎస్ ఐ పి అకాడమీ, గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలు, ఆస్ట్రేలియా మరియు ఇతర ప్రపంచ మార్కెట్లకు విస్తరించాలని యోచిస్తోంది. ఇది రెండు దశాబ్దాలలో 1 మిలియన్ కంటే ఎక్కువ మంది పిల్లలకు శిక్షణ ఇచ్చింది. ప్రస్తుతం, భారతదేశం అంతటా 1000 కేంద్రాలలో 1.75 లక్షల మంది విద్యార్థులు చేరారు, 5,000ం ఉపాధ్యాయులు దీనికి సౌకర్యాన్ని కల్పిస్తున్నారు, 1,500 పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.తెలంగాణ రాష్ట్ర అధిపతి భరత్, ఎస్ ఐ పి అకాడమీ తెలంగాణలో 71 కేంద్రాలను కలిగి ఉందని, 10,300ం విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారని, ఒక సంవత్సరంలోపు 100 కేంద్రాలకు పెంచాలని ప్రణాళికలు వేస్తున్నారని ప్రకటించారు. ఉమా స్వామినాథన్ ఎస్ ఐ పి అకాడమీ గ్రీన్ ఇనిషియేటివ్ - "క్రియేటింగ్ ఎ ఫారెస్ట్" ను హైలైట్ చేశారు, ఇది దట్టమైన స్థానిక అడవులను పెంచడానికి జపనీస్ టెక్నిక్ అయిన మియావాకి పద్ధతిని ఉపయోగిస్తుంది. ఎస్ ఐ పి ఇప్పటికే తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీ, మహారాష్ట్ర మరియు పశ్చిమ బెంగాల్‌లలో ఇటువంటి ఐదు అడవులను సృష్టించింది. రాష్ట్ర అటవీ శాఖతో కలిసి తెలంగాణలో మొట్టమొదటి మియావాకి అడవిని సృష్టించడానికి ప్రణాళికలు జరుగుతున్నాయి. ఎస్ ఐ పి గత ప్రాడిజీ పోటీలు మెగా, ఎక్సలెన్స్‌కు ప్రసిద్ధి చెందాయి, రికార్డు స్థాయిలో విద్యార్థుల భాగస్వామ్యం కోసం లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఆరు ఎంట్రీలను సంపాదించాయి.



ఎనుమాముల వాటర్ ట్యాంక్‌ని పరిశీలించిన ఎమ్మెల్యే నాగరాజు

## నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే

వరంగల్ జూన్ 29 ( నమస్తే ఉదయం బ్యూరో): గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ పాల్గొన్నారు. అనంతరం వరంగల్ నగరంలోనిఏనుమాముల వాటర్ ట్యాంక్ శిథిలావస్థలో ఉందని స్థానిక నాయకుల సమాచారం మేరకు వాటర్ ట్యాంక్ ను పరిశీలించి త్వరలోనే అధికారులతో మాట్లాడి నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణం కోసం కృషి చేస్తానని అన్నారు. అలాగే ఎనుమాముల పాత గ్రామ పంచాయితీ భవనాన్ని సందర్శించి మరమ్మత్తులు చేయించి, గ్రామంలోని పలు సమస్యలను మీద చర్చించి త్వరితగతన సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య, డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, నా పార్టీ అధ్యక్షుడు సౌరం చిన్నయ్య ఇందిరమ్మ కమిటీ సభ్యురాలు సౌరం బుచ్చమ్మ తో పాటు డివిజన్ గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఐసిఏఐ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్

### వరంగల్ బ్రాంచ్ చైర్మన్ పూజారి సత్యనారాయణ

### క్రీడలు మానసిక శారీరక ఒత్తిడి నుంచి విముక్తి

### సీఏ చదివితే భవిష్యత్తులో ఆర్థికంగా స్థిరపడే అవకాశం

### గెలుపొందిన విజేతలకు జూలై 1న బహుమతులు ప్రధానం

వరంగల్ జూన్ 29 (నమస్తే ఉదయం బ్యూరో): చార్టర్డ్ అకౌంట్ దినోత్సవం సందర్భంగా ఐ సి ఏ ఐ వరంగల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో చైర్మన్ పూజారి సత్యనారాయణ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహించారు. 5 రోజులపాటు నిర్వహించే కార్యక్రమాలలో భాగంగా ఆదివారం వరంగల్ ఎల్బీ కళాశాల మైదానంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం చార్టర్డ్ అకౌంట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ శాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఇండోర్ గేమ్స్ క్యారం బోర్డ్, చెస్, షటిల్ బ్యాడ్మింటన్ వరంగల్ ఎస్ఎన్ఎం క్లబ్లో నిర్వహించామని తెలిపారు. అవుట్ డోర్ గేమ్స్ క్రికెట్, వివిధ రకాల క్రీడలను నిర్వహించి గెలుపొందిన జట్టులకు జులై ఒకటో తేదీన ఐ సి ఏ ఐ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తామని తెలిపారు. క్రీడలు నిర్వహించడం వల్ల మానసిక శారీరక ఒత్తిడిని నుంచి విముక్తి ఉంది మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చు అని పేర్కొన్నారు. 2025 -26 సంవత్సరానికి వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చార్టర్డ్ అకౌంట్ విద్యను అభ్యసించడానికి విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థిని విద్యార్థులకు సీఏ చదివితే భవిష్యత్తులో ఆర్థికంగా స్థిరపడేందుకు కెరీర్ కౌన్సిలింగ్ కార్యక్రమాలను కూడా చేపడతామని ఈ సందర్భంగా చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎం. సుజిత్, సెక్రటరీ ఎస్. వినీల్ రావు, ట్రేజరర్ జీ. నికిత, సికాస చైర్మన్ బి. భగవాన్, ఎంసీ మెంబర్ హెచ్. భారత్, ఎక్స్ చైర్మన్ ఆర్. హరికృష్ణ, సభ్యులు బజాజ్, వెంకటేష్, గంగాధర్, రాజు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## రామచందర్‌రావు, ఈటలలో ఒకరికి అవకాశం!

### భాజపా అధ్యక్షుడు ఎవరో తేలేది నేడే

హైదరాబాద్, (నమస్తే ఉదయం): భాజపా రాష్ట్ర అధ్యక్ష పదవికి తుది రేసులో ఇద్దరి పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌లలో ఒకరికి అవకాశం దక్కే వీలుందని విశ్వసనీయ సమాచారం. కాబోయే నూతన అధ్యక్షుడికి సోమవారం ఉదయం జాతీయ నాయకత్వం నుంచి ఫోన్ ద్వారా సమాచారం అందనున్నట్లు తెలిసింది. రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం నియమితులైన ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి, కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే ఆదివారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ సోమవారం ఉదయం రానున్నారు. అధ్యక్ష ఎంపికలో కీలకమైన నామినేషన్ల ఘట్టం సోమవారం జరగనుంది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 4 వరకు భాజపా రాష్ట్ర కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఉంటుంది. నామినేషన్ వేసేది ఒకరేనని తెలిసింది. రాష్ట్ర అధ్యక్ష పదవికి మొదటి నుంచి నాలుగైదు పేర్లు వినిపించినా.. ఆదివారం పార్టీ వర్గాల్లో ఇద్దరి పేర్లపై ప్రధానంగా చర్చ జరిగింది. జాతీయ నాయకత్వం కొద్ది రోజుల క్రితమే తెలంగాణలోని ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, రాష్ట్ర ముఖ్య నేతల అభిప్రాయాలను తీసుకొన్నట్టు తెలిసింది. సంఘ్ నేతలు, పార్టీలో ఆది నుంచి ఉన్న సీనియర్ నేతలు పలువురు రామచందర్‌రావు పేరును ప్రతిపాదించినట్లు సమాచారం. మరోవైపు ఈటల పేరు చాలా కాలంగా పరిశీలనలో ఉంది. బీసీ వర్గానికి అధ్యక్ష పదవిలో పార్టీ ప్రాధాన్యం ఇస్తుందన్న చర్చ నేపథ్యంలో అధిష్ఠానం బాధ్యతలు తనకే అప్పగిస్తుందని ఈటల గట్టి ధీమాతోనే ఉన్నారు. వీరిలో ఎవరి పేరును నాయకత్వం ప్రకటిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. భాజపా రాష్ట్ర అధ్యక్షుడి పేరు ప్రకటించాక పార్టీ శ్రేణులు సంబరాలు ఘనంగా చేయాలని పార్టీ నిర్ణయించింది. ఎన్నిక నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా మన్నెగూడలోని ఒక ఫంక్షన్ హాలులో ఆదివారం రాత్రి పార్టీ శ్రేణులు సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర భాజపా ఇంఛార్జ్ అభయ్‌పాటిల్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు జి.మనోహర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. జులై 1న ఎల్బీనగర్‌లోని ఒక ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర అధ్యక్షుడి పేరును పార్టీ అధికారికంగా ప్రకటించనుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.



## ఎం.వి ఫౌండేషన్ బ్రిడ్జి కోర్స్ క్యాంప్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

### ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి



గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 29(నమస్తే ఉదయం) జోగులాంబ గద్వాల్ జిల్లా ధరూర్ మండల్ హెడ్ క్వార్టర్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో తరాల చాకిరి దోపిడి ఉన్నత స్థానానికి చేరుకున్నారు. నిరాశల నుండి విముక్తి పొంది అన్ని అవకాశాలను అందుకునే అర్హత సంపాదించింది సమాజంలో వివిధ రంగాలలో శ్రమ నుండి విముక్తి పరిచింది. క్యాంపు టీచర్లు తాము పడ్డ శ్రమ ఫలితం పండరినాథ్ పసుల కాపరి నుండి పాతపాలెం బ్రిడ్జి కోర్స్ నుండి 7 తరగతి పూర్తి చేసుకొని కోయిలకొండ బీసీ వెల్ఫేర్ హాస్టల్లో 10 తరగతి పూర్తి చేసుకొని ఇంటర్ జ్ఞానప్రభ జూనియర్ కళాశాల లో పూర్తి చేసుకొని ఇంటిగ్రేటెడ్ పీజీ కర్నూల్ కాకతీయ యూనివర్సిటీ వరంగల్ లో పీహెచ్డీ డాక్టరేట్ పూర్తి చేసుకుని సైంటిస్ట్ గా గాంధీ మెడికల్ కాలేజ్ రీసెర్చ్ గా పని చేస్తున్నాడు. అదేవిదంగా బ్రిడ్జి కోర్స్ క్యాంపులో 750 మంది బడియట పిల్లలను తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎం.వి ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్ వెంకట్ రెడ్డి హాజరై పని నుండి విముక్తి ప్రయోజకులైన వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ ఇంచార్జ్ శోభ ,రేవతి , మండల్ ఇంచార్జ్ రచయ్య , క్యాంపు టీచర్లు ప్రాజెక్టు కోనేటర్ శంకర్ , పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



## నూతనంగా నిర్మించిన రైల్వే స్టేషన్‌కు రాధాకృష్ణ నగర్ పేరు పెట్టాలి

మల్కాజ్గిరి, జూన్ 29(ప్రధాన ఉదయం)నూతనంగా నిర్మించిన రైల్వే స్టేషన్ కు రాధాకృష్ణ నగర్ పేరు పెట్టాలని మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఆదివారం మల్కాజ్గిరి ఎమ్మెల్యే కార్యాలయంలో మల్కాజ్గిరి డివిజన్ ఆర్కే నగర్ కాలనీవాసులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసి మల్కాజిగిరి రైల్వే స్టేషన్ సమీపంలో దయానందనగర్ ఈస్ట్ లో నూతనంగా నిర్మించిన రైల్వే స్టేషన్ కు రాధాకృష్ణ నగర్ పేరు పెట్టాలని కోరారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చేసిన కృషికి ప్రతిఫలంగా మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బి ఆర్ ఎస్ నాయకులు జె ఎ సి వెంకన్న, మేకల సునీత రాము యాదవ్, ఆర్కే నగర్ వాసులు, రిటైర్డ్ ఐ ఆర్ టి ఎస్ రంగారావు, సోమశేఖర్, రాఘవేంద్ర, ఎస్ఎస్ గుప్తా, రవికిరణ్, సాయినాథ్, విజయ్ కుమార్, శ్యామ్, శివకుమార్, నహీం ఖాన్, సుధాకర్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారుడి ఇంటి నిర్మాణ పనుల భూమి పూజ చేస్తున్న మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్

## పేదల కోసం పనిచేసేది కాంగ్రెస్ ప్రభుత్వమే

### వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె బాగు ప్రశాంత్

కొత్తకోట, జూన్ 29(నమస్తే ఉదయం) పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేసే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని మదనాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె పాగు ప్రశాంత్ అన్నారు. ఆదివారంకొత్తకోట మున్సిపాలిటీ కేంద్రం 11వ వార్డు ఇంచార్జ్ జె ఎం మీషేక్ ఆధ్వర్యంలో 11.వార్డ్ లో జ్యోతి ,వినోద్ దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి భూమి పూజ కార్యక్రమనికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత పదేళ్ల బి.ఆర్.ఎస్ ప్రభుత్వంలో పేదలను విస్మరించిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఎన్ జే బోయజ్, వనపర్తి జిల్లా రైతు విభాగం అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేముల హరీష్ రెడ్డి, జె కురుపయ్య, ఎం భాస్కర్, కొమ్ము క్రాంతి కుమార్,జేక్. రాజు,ఇద్దరమ్మా కమిటీ సభ్యులు కృష్ణయ్య, కె దిలీప్, జె సతీష్, పెద్దరాజు చిన్నరాజు, జిఎంఆర్ సోషల్ మీడియా నవీన్ కుమార్, తదితరులు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.



పదవి విరమణ చేసిన ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ ను సన్మానిస్తున్న నాయకులు

## బోయిళ్ళ చంద్రశేఖర్ ఉపాధ్యాయ వృత్తికి చేసిన సేవలు మరువలేనివి

కొత్తకోట, జూన్ 29 (నమస్తే ఉదయం) ఉపాధ్యాయుడిగా బోయిళ్ళ చంద్రశేఖర్ బోధనలు చేపట్టి ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్ది బావి భారత పౌరులుగా తీర్చిదిద్దారని పలువురు నాయకులు కొనియాడారు.ఆదివారం కొత్తకోట పట్టణ కేంద్రం లోని జేవిఆర్ ఫంక్షన్ హాల్ పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు బోయిళ్ళ చంద్రశేఖర్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి పలువురు నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొని సన్మానించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయ రీత్యా విద్యార్థులకు ఉత్తమైన చదువు చెప్పుతూ విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించిన ఉత్తమైన వ్యక్తి బోయిళ్ళ చంద్రశేఖర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, మాజీ సి డి సి చైర్మన్ చెన్నకేశవరెడ్డి, మాజీ ఎంపీపీ గుంత మల్లేష్ ,మాజీ మార్కెట్ డైరెక్టర్ ఎల్ఐసి కృష్ణయ్య గౌడ్ , నరసింహా తదితరులు పాల్గొన్నారు.

# 1984-85 పదవ తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం


కొలన్ దరంపాల్ రెడ్డి కి జ్ఞాపిక ను బహుకరిస్తున్న నిర్వాహకులు ఎన్ బాబు రాజ్


కృష్ణా రెడ్డి కి జ్ఞాపిక ను బహుకరిస్తున్న సయ్యద్ హిదాయతుల్లా షఫీ


ఆత్మీయ సమ్మేళనం నిర్వాహకులు


మాట్లాడుతున్న జయశ్రీ (ప్రస్తుతం టీచర్)


ఎం శ్రీనివాస్ యాదవ్ దంపతులు


సామ సుమన్ రెడ్డి కి జ్ఞాపిక ను బహుకరిస్తున్న ఎ. భీమయ్య


బి ఆంజనేయులు కు జ్ఞాపికను బహుకరిస్తున్న వేముల చక్రపాణి


మాట్లాడుతున్న పి మహేశ్వర్


వై శ్రీధర్ దంపతులు


వై రామానంద స్వామీ దంపతులు



డ్యాన్స్ చేస్తున్న రాంబాబు యాదవ్ విజయ లక్ష్మీ దంపతులు


మంజూర్ అహ్మద్ కు జ్ఞాపిక బహుకరణ


గాబ్రియేలమ్మ టీచర్ తో విద్యార్థులు

## ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకి
# 100 సంవత్సరాలు ఎలాంటి ధోకా లేదు

### గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి .. అపోహలు సృష్టించడం మానుకోండి.. ప్రజలకు మేలు చేసే విధంగా ఉండాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 29(నమస్తే ఉదయం) ప్రజలకు మేలు చేసే విధంగా ఉండాలి తప్ప తప్పుదోవ పట్టించే విధంగా లిఉండకూడదని గద్వాల అసెంబ్లీ నియోజకవర్గం శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు.ఏ ప్రభుత్వాలు వచ్చిన ప్రజలకు మేలు చేయాలని ప్రయత్నిస్తాయి... హాని కలగాలని ప్రయత్నించరని గుర్తు చేశారు.గద్వాల అభివృద్ధి కోసమే ప్రభుత్వానికి మద్దతుగాఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఉన్నాను తప్ప స్వార్థ ప్రయోజనాల కోసం కాదని కృష్ణమోహన్ రెడ్డి స్పష్టం చేశారు.ఆదివారం గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ....శనివారం గద్వాల నియోజకవర్గంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి , రాష్ట్ర మత్స్యకార , యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి జూరాల ప్రాజెక్టు, ర్యాలంపాడు రిజర్వాయర్ ను సందర్శించడం జరిగినది. ఈ సందర్భంగా ఓ మాజీ శాసనసభ్యులు సీనియర్ నాయకులు మాట్లాడుతూ జూరాల ప్రాజెక్టులో కూలిపోతాది. ఎక్కువ వాహనాలు తిరగడం వల్ల ప్రాజెక్టు కూలిపోతుందని ప్రజలకు భయాందోళన కల్పిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు ఆది సరైన పద్ధతి కాదు. జూరాల ప్రాజెక్టులో కొంత సమస్యలు ఉన్న మాట వాస్తవమే కానీ ప్రాజెక్టు కూలిపోయేంత పరిస్థితి (కాదు)లేదు. సమస్య లేకపోయినా కూడా ప్రజలకు తప్పుడు మాటలు చెప్పి ప్రజలకు భయాందోళన కల్పించడం సరైన పద్ధతి కాదని సూచించారు. ఏ ప్రభుత్వాలు వచ్చిన ప్రాజెక్టులను మరింత అభివృద్ధి చేయాలా ప్రాజెక్టుల్లో పూర్వ వైభోగం తీసుకురావడానికి కృషి చేయడం జరుగుతుంది కానీ ప్రాజెక్టులను నాశనం చేయాలని ప్రాజెక్టులను రిజర్వాయర్లను పోతేపోనీ అని ఎవరు కూడా అనుకోరు. గత ప్రభుత్వంలో కూడా ప్రాజెక్టుల అభివృద్ధికి కృషి చేయడం జరిగింది ఇప్పుడు ఈ ప్రభుత్వంలో కూడా ప్రాజెక్టులో ఉన్న చిన్నచిన్న సమస్యలను మరమ్మతులను పరిష్కరించే విధంగా ప్రాజెక్టులకు , ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసే విధంగా సమస్యలను పరిష్కరించడం జరుగుతుంది ఎప్పటికప్పుడు ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేయడం జరుగుతుంది తెలిపారు. ప్రాజెక్టు లోపలికి వెళ్లడానికి కూడా పరిస్థితి బాగాలేదని మాట్లాడడం సరైన పద్ధతి కాదు ఈ ఫోటోల ద్వారా చూడండి ప్రాజెక్టు లోపల అధికారులు లోపలికి వెళ్లి పరిశీలిస్తున్నారు. మీరు (జర్నలిస్టు) కూడా మాతో పాటు వస్తే ప్రాజెక్టు లోపలికికెళ్లి చూడవచ్చు. విలేకరులు రేపు ప్రాజెక్టు సందర్శనకు వెళ్లి లోపల ఎలాంటి సమస్యలు లేవని ప్రజలకు నిజనిజాలు చూపించే విధంగా మీడియా ద్వారా ప్రజలకు కూడా వాస్తవాలు చెప్పడానికి అవకాశం ఉంటుంది కాబట్టి, రేపు (సోమవారం ) మీరు ( జర్నలిస్టు) ప్రాజెక్టు దగ్గరికి రండి మేము తీసుకువెళ్లి వాస్తవాలను చూపిస్తాము. అందువల్ల ఎవరైన ప్రజలను తప్పుదోవ పట్టించకుండా నిజనిజాలు తెలుసుకొని మాట్లాడాలని కోరారు.గద్వాల నియోజకవర్గంలో నేను ఏ పార్టీ అని విమర్శిస్తున్నారు . వారికి నేను సూటిగా సమాధానం చెప్పున్నాను నేను అభివృద్ధి పార్టీ గద్వాల అభివృద్ధి కోసమే అధికార పార్టీకి మద్దతు తెలపడం జరిగింది. గద్వాల నియోజకవర్గంలోని ప్రజలు ,రైతాంగం, వ్యాపారస్తులు అభివృద్ధి చెందాలని గద్వాల నియోజకవర్గం రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గల కన్నా ముందు ఉండాలని సదుద్దేశంతో అధికార పార్టీలో భాగస్వాములై మద్దతు తెలపడం జరిగిందని అని పేర్కొన్నారు. గతంలో గట్టు మండలం ఆసియా ఖండంలోనే అక్షరాస్యతలో వెనుకబడినది కానీ ప్రస్తుతం గట్టు మండలం 62 శాతం పెరగడం జరిగినది. అదేవిధంగా గద్వాల పట్టణంలో, ప్రతి గ్రామంలో సిసి రోడ్లు నిర్మాణం డ్రైనేజీ నిర్మాణం అదేవిధంగా అన్ని విధాలుగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవడం గద్వాల పట్టణంలో కూడా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కొన్ని చిన్నచిన్న సమస్యల వల్ల కొన్ని ప్రాంతాలలో అభివృద్ధి ఆలస్యం అవుతున్నాయి వాటిని కూడా వెంటనే పరిష్కరించి అభివృద్ధి చేసే విధంగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. నా చివరి శ్వాస వరకు గద్వాల నియోజకవర్గ అభివృద్ధి కొరకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గద్వాల మున్సిపల్ మాజీ చైర్మన్, జిల్లా సీనియర్ నాయకులు జి వేణుగోపాల్, ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, మాజీ ఎంపీపీ ప్రతాప్ గౌడ్, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్, మాజీ కౌన్సిలర్ శ్రీను ముదిరాజ్, నాయకులు గోవిందు, కురుమన్న ధర్మ నాయుడు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




డ్యాం పరిస్థితి చిత్రపటాన్ని చూపిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ జి వేణుగోపాల్


జూరాల ప్రాజెక్టు ను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే డీకే భరత సింహారెడ్డి

# అబద్దాలతో మసిబూసి మారేడు కాయ చేయాలని చూస్తున్నారు

### ర్యాలంపాడు రిజర్వాయర్ రిపేర్ల పై ఇంకా ఎన్ని రోజులు అబద్ధాలు చెబుతారు
### మాజీ ఎమ్మెల్యే డీకే భరత సింహారెడ్డి

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 29(నమస్తే ఉదయం)ర్యాలంపాడు రిజర్వాయర్ పై ఇంకెన్ని రోజులు అబద్దాలు చెప్తారని మసిపూసి మారేడు కాయ చేసి అది చేస్తాం, ఇది చేస్తామంటూ రోజుకో అబద్ధం చెబుతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై గద్వాల మాజీ ఎమ్మెల్యే డీకే భరతసింహ్మారెడ్డి ఆరోపించారు. ఆదివారం జూరాల ప్రాజెక్టు, ర్యాలంపాడు రిజర్వాయర్ లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ర్యాలంపాడు స్టోరేజ్, లీకేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా 2 టీఎంసీలతో ర్యాలంపాడు రిజర్వాయర్ ను నిర్మాణానికి డిజైన్ చేశారని, నీటి సామర్థ్యం 2 టీఎంసీల నుంచి 4, టీంఎంసీలకు పెంచడం వల్లే రిజర్వాయర్ కు సమస్యతలెత్తిందన్నారు. ర్యాలంపాడు రిజర్వాయర్ కు బుంగలు ఏర్పడి యేండ్లు కావొస్తుందని, ప్రభుత్వాలు లీకేజీ మరమ్మతులకు కమిటీలతో కాలయాపన చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అప్పటి ఇరిగేషన్ శాఖ ఈఎన్ సీ మురళీధర్ రావు తప్పిదాల వల్లే ర్యాలంపాడు రిజర్వాయర్ 2టీఎంసీల నుంచి 4 టీఎంసీలకు పెంచి రిజర్వాయర్ భద్రతకు ముప్పువాటిలిందన్నారు. దీంతో రిజర్వాయర్‌కు ఏర్పడ్డ లీకేజీల కారణంగా పూర్తిస్థాయిలో నీటిని నింపుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. గట్టు లిఫ్ట్ రివ్యూ మీటింగ్ వచ్చినప్పుడు ర్యాలంపాడు రిజర్వాయర్ కు రిపేర్లు చేస్తామని చెప్పిన రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మళ్లీ ఆరు నెలల తర్వాత వచ్చి మళ్లీ ఉత్త మాటలు చెప్పి రిపేర్లు చేస్తామంటూ కాకమ్మ కబుర్లు చెబుతున్నారని మండిపడ్డారు. ర్యాలంపాడు రిజర్వాయర్ నిర్మాణం కేవలం రెండు టీఎంసీలకు డిజైన్ చేయబడింది అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఇప్పుడు నాలుగు టీఎంసీల నీళ్లు ఆపాలన్నా, బుంగలు రిపేర్లు జరగాలన్న బండ్ మార్చాల్సిందేనని ఆయన తేల్చి చెప్పారు. దీనిపై గతంలోనే తాము ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అయినప్పటికీ అప్పటి నుంచి మురళీధర్ రావు బిల్లులు చెల్లించడం జరిగిందన్నారు. ఇప్పుడు జరిగే అన్ని పరిణామాలపై గతంలోనే తాము స్పష్టంగా ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. 300 పేజీల నివేదిక తమ దగ్గర ఉన్నదని ఇందులో ఏ ఒక్కటి అబద్ధమాన్ని తీర్చిన తాము రాజకీయ సన్యాసం తీసుకుంటానన్నారు. ర్యాలంపాడ్ రిజర్వాయర్ పై సిట్టింగ్ హైకోర్టు జడ్జిచే విచారణ చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వాయర్ లీకేజీల మరమ్మతుకు పుణె కమిటీతో పరిష్కారం దొరుకుతుందని ప్రభుత్వం భావించిన నేటికి నిరాశగా మారిందని అన్నారు.నెట్టంపాడు ఎత్తిపోతల పథకానికి గుండెకాయలాంటి ర్యాలంపాడు రిజర్యాయర్ లీకేజీలను అరికట్టేందుకు ప్రభుత్వ అనుభవజ్ఞులైన నిపుణుక కమిటితో నివేధిక తయారు చేసి మరమ్మతులు చేయాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ర్యాలంపాడు రిజర్వాయర్ 4 టీఎంసీలు పెంచాలంటే మరో సారి రిజర్వాయర్ ను పునర్నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అదే విధంగా గట్టు ఎత్తిపోతల పథకానికి ర్యాలంపాడు రిజర్వాయరే ఆధారం కాబట్టి రిజర్వాయర్ ను పటిష్టం చేయాలన్నారు.

#### జూరాల ప్రాజెక్టు పై నిజాలే చెప్పాను

జూరాల ప్రాజెక్టుపై ముమ్మాటికి తాను మొత్తం నిజాలే మాట్లాడడం జరిగిందని, ఎవరిని భయభ్రాంతులకు గురి చేసేందుకు మాట్లాడలేదని విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. లిఫ్టులు పనిచేయకపోయినా షిల్ట్ ను తొలగించామని చెప్పడం వారికే చెల్లుతుందన్నారు. స్వప్న కన్స్ట్రక్షన్ కంపెనీకి ఎలాంటి పనులు చేయకుండానే ఏటా నాలుగు కోట్లు ఇస్తున్నది వాస్తవం కాదా అనే విషయాన్ని ఆఫీసర్లు, అధికార పార్టీ నాయకులు బహిర్గతం చేయాలన్నారు. రోప్ లు తెగిపోయి నాలుగు గేట్లు ద్వారా నీళ్లు కూడా వదిలేయని పరిస్థితి ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట రాములు,జిల్లా ఉపాధ్యక్షుడు రజక నరసింహ, బిజెపి సీనియర్ నాయకులు మిర్జాపురం రామచంద్రరెడ్డి, సంజీవ్ భరద్వాజ్, కృష్ణం రాజు, రఘు గౌడ్ తదితరులు ఉన్నారు..


జూరాల ప్రాజెక్టు, ర్యాలంపాడు రిజర్వాయర్ ను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే భరత సింహారెడ్డి